# మిసెస్ రాజారావు

టివిలో వార్తలు చూస్తోంది హిమబిందు. పిల్లలిద్దరూ రీడింగ్ టేబిల్ దగ్గర కూర్చుని హోంవర్క్ చేసుకుంటున్నారు. హిమబిందు తన మంచం మీద కొద్దిగా దిండు మీదికి వాలి పడుకుని విశ్రాంతిగా టివి చూస్తోంది. చాలా రోజుల తరవాత ఇంట్లో టివి మోగుతోంది. తెలుగు న్యూస్‌రీడర్ వార్తలు చదువుతోంది. ఎలక్షన్స్ దగ్గర పడ్డాయి. నామినేషన్ల పర్వం మొదలైంది. ఎవరికో టికెట్టు దొరకలేదుట. కొట్లాటలు జరుగుతున్నాయి. వీధినబడి దారుణంగా కొట్టుకుంటు న్నారు. చొక్కాలు చింపుకుంటున్నారు... గోల, అరుపులు, కేకలు.

"మమ్మీ! భయం వేస్తోంది" ఆ గోలకి వెనక్కి తిరిగిన చిన్న కూతురు నవ్య టివి వైపు చూస్తూ భయంగా అరిచింది.

హిమబిందు తక్కున రిమోట్‌తో టివి ఆఫ్ చేసింది.

కూతురు కళ్ళల్లో భయం చూసి మృదువుగా అంది... "హోంవర్క్ పూర్తి అయిందా?"

"లేదు... ఇంకా కొంచెం వుంది."

"ఆ కాస్తా పూర్తి చేయి... అన్నాలు తిందురుగాని"

పెద్దకూతురు రమ్య కూడా ఒక్కసారి వెనక్కి తిరిగి, "నాది అయిపోతోంది మమ్మీ!" అంది.

"గుడ్... ఇద్దరూ కంప్లీట్ చేసాక ఇద్దరికీ ఒకేసారి అన్నం పెడతా సరేనా" మంచం మీంచి లేచి, పిల్లలిద్దరి తలల మీదా చేతులేసి, ప్రేమగా జుట్టు సవరిస్తూ అంది హిమబిందు.

***

"ఓ.కె." తిరిగి నవ్య హోంవర్కు చేయడంలో మునిగిపోయింది.

హిమబిందు కొంచెం రిలీఫ్‌గా నిట్టూర్చి అక్కడేవున్న మరో కుర్చీ లాక్కుని నవ్య పక్కనే కూర్చుంది.

పిల్లలకి అసెంబ్లీ అంటే భయం... గొడవలంటే భయం... ఖద్దరు బట్టలంటే భయం... మనుషులంటే ముఖ్యంగా మగవాళ్ళంటే భయం... తాతలు, తండ్రి, పిన్నాన్నలు, మామలు అందరూ వాళ్ళలో భయం కలిగించడానికి కర్తలే... ఈ భయం నుంచి వాళ్ళని బయటకి తీసుకురావాలి. ప్రస్తుతం తన ముందున్న కర్తవ్యం... వాళ్ళల్లో భయం పోగొట్టి ధైర్యాన్ని, మానసిక బలాన్ని కలిగించాలి... అలా చేయాలంటే ఏం చేయాలి? ఈ ఇంట్లో రాజకీయం కనిపించకుండా, వినిపించకుండా చేయాలి. అతనితోటే అన్నీ అంతం... అతని భార్యగా, ఆ ఇంటి కోడలిగా తన పాత్ర ముగించేయాలి. తనది అనే ఒక కొత్త, స్వతంత్ర జీవితం ప్రారంభించాలి. ఆ జీవితంలో ఏ రాజకీయాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తపడాలి. ఎవరి ఒత్తిడులకి లొంగకూడదు. ఏ ప్రలోభాలని ఖాతరు చేయకూడదు.

ఫోన్ మోగింది... ఆమె ఫోన్ వైపు చూసింది... ఫోన్ కూడా భయంతో వణుకుతున్నట్టే అనిపించింది. ఈ రింగ్ అక్కడిదే... వాళ్ళే చేసి వుంటారు. నెమ్మదిగా ఒంగి ఫోన్ చేతిలోకి తీసుకుంది.

గొంతు సవరించుకుని 'హలో!' అంది.

"అమ్మా... మిసెస్ రాజారావుగారా... నేనమ్మా హోంమంత్రిని. నమస్కారం తల్లీ! సిఎంగారు ఢిల్లీ నుంచి రేపు వస్తారు. నామినేషన్ వేసేందుకు రేపొక్కరోజే టైం వుంది. మీ ఫొటోతోసహా మీ బయోడేటా రేపు ఉదయం పంపించండి. మా మనిషి మీ దగ్గరకు వస్తాడు. ఆ చూడమ్మా! ఫొటో వేరేది తీయించుకో... బొట్టు లేకుండా, తెల్లచీరతో... ఆ తరవాత అంటే పదవి వచ్చాక నీ ఇష్టం... ఏ చీరలైనా కట్టుకోవచ్చు. ఇలా అంటున్నానని ఏం అనుకోకు."

హిమబిందు హృదయం రగిలిపోయింది.

రాజారావు భార్యగా ఆయన స్థానంలోకి వెళ్ళాలి. వాళ్ళ పార్టీ ప్రయోజనాల కోసం, వాళ్ళ అధికారాలు పటిష్టం కావడం కోసం ఇవాళ అకస్మాత్తుగా రాజకీయాల్లో స్త్రీల హక్కుపైన వాళ్ళల్లో చైతన్యం కలిగింది. కేవలం మెజారిటీ కోసం, తనపై ప్రజలు సానుభూతి వర్షం కురిపించి ఓట్లు వేస్తారట. ప్రజలంత పిచ్చి వాళ్ళా... ఇంతకాలం రాజకీయాల్లో కనిపించని ఈ స్త్రీకి ఏం తెలుసు? మమ్మల్ని ఈమె ఎలా పాలించగలదు? అని ఏ ఒక్కరూ ఆలోచించకుండా ఓట్లు వేసేస్తారా? వాళ్ళ సానుభూతి కోసం తను బొట్టు పెట్టుకోకూడదా? భర్తపోయిన తను విధవరాలి గెటప్‌లో ఫొటో తీసుకుని, కళ్ళల్లో దైన్యం నింపుకుని వుంటేనే అందరూ తనపైన సానుభూతి చూపిస్తారు. ఏం? ఎప్పటిలా మంచి చీర కట్టుకుని, అందంగా

తయారవకూడదా? ఏం మనుషులు? అయినా తనకిష్టం లేని డ్రైనేజీలాంటి రాజకీయాల్లోకి తానెందుకు వెళ్ళాలి. ఎవరికోసం వెళ్ళాలి?

నిన్న సి.ఎం.గారి నుంచి కబురు వచ్చింది. కారు పంపించారు. ఆయనింటికి తీసుకెళ్ళారు.

రాజారావు స్థానంలో ఆమెని ఎన్నికల్లో పోటీ చేయమన్నారు. స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ వుందిట. స్త్రీలు కూడా రాజకీయాలలోకి రావల్సిన అవసరం వుందిట. స్త్రీలకే పురుషులకన్నా ఎక్కువ తెలివితేటలు, ధైర్యం వుంటాయిట. స్త్రీలైతే నిజాయితీతో, నిబద్ధతతో వ్యవహరించి ధర్మబద్ధంగా వ్యవహరిస్తారుట. తనకి తప్పకుండా సానుభూతి ఓట్లు పడతాయట. అందుకే తనని ఎన్నికల్లో పోటీ చేయమంటున్నారట. తనేం చేయక్కర్లేదుట. తన తరపున వాళ్ళే నామినేషన్ వేస్తారుట. ప్రచారం చేస్తారుట. అన్నీ వాళ్ళే చేస్తారుట. కేవలం తన ఫొటోలు, తన బయోడేటా కావాలిట. బయోడేటా అంటే రాజారావుతో ఎప్పుడు పెళ్ళైంది... తమ సంసారం ఎంత అన్యోన్యంగా సాగింది... అతను తనని ఎంత గౌరవించాడు... భార్యగా తనకి ఎన్ని సమాన హక్కులిచ్చారు... వగైరా... ఏవీ! అవన్నీ తన దగ్గర లేవే. తన పేరు హిమబిందు... తండ్రి పేరు మాణిక్యాలరావు... తను ఇంగ్లీషు లిటరేచర్‌లో ఎం.ఏ చేసింది. కొంతకాలం నాట్యం నేర్చుకుంది. కాలేజీలో ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంది. ఎన్నో బహుమతులు పొందింది. అవన్నీ అవసరం లేదుట. చాలాసేపు దాదాపు మూడుగంటలపాటు ముఖ్యమంత్రి గారు, ఇతర మంత్రులు ఏవేవో చెప్పారు. "రాజారావు మంచివాడు, సహృదయుడు, కష్టపడి నిజాయితీగా పనిచేసేవాడు. ప్రజల కష్టాలే తన కష్టాలుగా భావించేవాడు. (కాని తన సుఖం ప్రజల సుఖంగా మాత్రం భావించలేకపోయాడు.) అతని స్థానాన్ని తను భర్తీ చేయాలి. రాజారావు భార్యగా, శాసనసభ్యురాలిగా ఇంకా గౌరవం వస్తుంది. తనకి, తన పిల్లలకి చదువు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు ఏ లోటు లేకుండా, ఏ కష్టం లేకుండా హాయిగా సాగిపోతాయి. ఆలోచించుకుని చెప్పమ్మా, ఫర్వాలేదు... ఒకరోజు టైం తీసుకో... ముఖ్యమంత్రిగారు ఎంతో సానుభూతితో గడువిచ్చారు.

"హు" ఆమె కళ్ళముందు అసెంబ్లీ సమావేశాలప్పుడు జరిగే యుద్ధకాండ మెదిలింది.

ఎప్పుడు సమావేశాలు జరిగినా ఉద్రేకాలతో, ఆవేశాలతో, కక్షలతో క్రమశిక్షణ, మర్యాద, సంస్కారం అనేవి లేకుండా కుక్కల్లాగా కొట్లాడుకుంటారు.

రాజకీయం అంటే ఇదేనా? అందరూ వయసు మళ్ళినవాళ్ళే... ఎందుకు వీళ్ళంద రికీ ఈ ఆవేశాలు? ఈ పదవులు, ఈ తాపత్రయాలు... జీవితంలో అన్నీ అయి పోయినవాళ్ళు హాయిగా యువత చేతుల్లో దేశ భవిష్యత్తు పెట్టి విశ్రాంతి తీసుకో వచ్చుగా... ఊహు... అలా చేస్తే వీళ్ళంతా రాజకీయవాదులెలా అవుతారు? వయసు ఉడిగినా, కాటికి కాళ్ళు చాచుకున్నా, డబ్బు మీద, కీర్తి కిరీటాల మీదా కాంక్ష చావదు... అన్ని రంగాల్లో వృద్ధులే... అరవైలు, డెబ్బైలు దాటినా డబ్బు యావ, కీర్తి కాంక్ష... యువతని పైకి రానివ్వని కర్కశత్వం... ఛీ... ఏం మనుషులు? పదవుల కోసం దెబ్బలాటలు, ఒకరినొకరు చంపుకోడాలు, పోటీకి వచ్చినవాళ్ళని అడ్డంగా నరికేయడాలు... పదవులు కొనుక్కోడానికి అడ్డదారుల్లో డబ్బు సంపాదించ డాలు, అమాయకుల, పసిపిల్లల వెచ్చని రక్తంతో చలికాచుకునే నీచులు, ఆడపిల్లల శీలాన్ని తమ కామాగ్నిలో సమిధలుగా చేసుకునే పందులు... వీళ్ళంతా దేశాన్ని పాలించేవాళ్ళు, కాపాడేవాళ్ళు. ఈ అశుద్ధంలో ఒక పురుగు ఈ పిల్లల తండ్రి.

హిమబిందుకి రాజారావు జ్ఞాపకాలు మదిలో మెదిలాయి.

ఒద్దన్నకొద్దీ కట్టబెట్టాడు తన తండ్రి. రాజకీయాల్లో పుట్టి, రాజకీయాల్లో పెరిగిన పదవి పోయిన ఎం.పి... రాజకీయాల్లోంచి ఏరి కోరి కూతురికి కట్ట బెట్టాడు. ఆమెకన్నా వయసులో పదేళ్ళు పెద్దవాడైనవాడిని ఈడూజోడూ చూడ కుండా కేవలం స్వలాభం కోసం అతని ద్వారా తన స్థానం పటిష్టం చేసుకోడానికి... అతని ద్వారా తన పార్టీని బలోపేతం చేసుకోడానికి... అడ్డువచ్చిన భార్యను కళ్ళతోటే కాల్చేస్తూ, ఏడుస్తున్న కూతుర్ని నిర్దయగా మెడవంచి ఉరితాడు వేయిం చాడు. హిమబిందు మిసెస్ రాజారావు అయింది. బోలెడంత డబ్బు... గౌరవం, అడుగులకి మడుగులొత్తే సేవకులు, అడుగుతీసి అడుగు వేయాలంటే కారు... సెక్యూరిటీ... ఎసి రూమ్‌లు... ఓహ్... ఎన్ని భోగాలు.

“మిసెస్ రాజారావు” హిమబిందుగా పొందలేని గౌరవాలెన్నో, మర్యాదలెన్నో మాణిక్యాలరావు కూతురుగా పొందలేని భోగాలెన్నో మిసెస్ రాజారావుగా మారాక లభించాయి. దానిక్కారణం అతను తన భర్త. మిస్టర్ రాజారావు మామను మించిన అల్లుడు. మామ నెత్తినే చేతులు పెట్టి, పార్టీలు మార్చి అధికారపక్షంలో చేరినవాడు. పార్టీలే కాదు... పెళ్ళాల్ని కూడా అవలీలగా మార్చగల ఘనుడు. డబ్బు వెదజల్లి పదవులు, అధికారాలు కొనుక్కుని ఎమ్ఎల్ఏ అయ్యాడు. ఆ డబ్బు కోసం చేయని దగా లేదు, చేయని వ్యాపారం లేదు. కిళ్ళీ వ్యాపారం నుండి కిడ్నీ వ్యాపారం దాకా.

కానీ, ఆ గౌరవాలు, ఆ రక్షణ వలయాలు ఆ భద్రతా జీవితం తనకి ఏవగింపు, అతనింట్లో ఆ రక్తపు కూడు తినాలంటే అసహ్యం, ఆ పటిష్టమైన భవనం నుంచి, అతని భార్య అన్న పంజరపు బతుకు నుంచి పారిపోవడానికి ఎంతో ప్రయత్నించింది... ప్రతిఘటించింది. పెళ్ళాం వదిలేసిందని ప్రజలకి తెలిస్తే, చెడ్డపేరు వస్తుందని కాపలా కుక్కల్ని పెట్టి, కదలకుండా చేశాడు. బలవంతంగా హిమబిందు మిసెస్ రాజారావుగా వుండిపోవాల్సి వచ్చింది. అయిష్టంగా, అసహ్యంగా వాడి రాక్షస రతి నుంచి జనించిన పిల్లలు... దురదృష్టవశాత్తూ ఆడపిల్లలు... అయినా ఈ పాపకార్యంతో ఎటువంటి సంబంధం లేని పసివాళ్ళని, తను ప్రేమించింది. వాళ్ళకోసం వాళ్ళని తండ్రిలేని వాళ్ళుగా చేయకూడదని భావించింది. ఒక దుర్మార్గుడిని, పరమ నీచుడిని భర్తగా... అతని పడగనీడలో జీవితం వెళ్ళబుచ్చింది. క్షణంక్షణం భయపడుతూ, ప్రతి చిన్న సవ్వడికీ బెదిరిపోతూ, ఏ క్షణంలో ఏ ఉపద్రవం వస్తుందో అని అదిరిపడుతూ, పిల్లలు ఎదుగుతున్నారని భయపడుతూ ఎదిగిన కొద్దీ ఆ నీచుడి కళ్ళకి వీళ్ళు కూడా వ్యాపార వస్తువుల్లా కనిపిస్తారేమోనని... భయం గుప్పిట్లో బతుకు పెట్టుకుని చస్తూ బతికింది.

“హమ్మయ్య”.. ఆరోజు సరిగ్గా నాలుగు నెలల క్రితం.. ఎంత మంచి వార్త వింది.

ఎన్నికల ప్రచారానికి సిద్ధిపేట వెళ్ళిన ఎవరో దుండగులు కిరాతకంగా కాల్చి చంపారని టివిలో ఫ్లాష్ న్యూస్. పిల్లలకి అన్నం పెడుతోంటే కనిపించింది. అత్తగారు గుండెలు బాదుకుంది. కానీ, తను నింపాదిగా పిల్లలకి అన్నం పెట్టేసింది. అదేంటో! చిత్రంగా తనకి బాధ కలగలేదు. దుఃఖం రాలేదు. భయం వేయలేదు. ఎంతో నిశ్చింతగా, ఎవరో వచ్చి తన చుట్టూ వున్న క్రూరసర్పాలను చేత్తో విసిరి పారేసినంత హాయిగా నిట్టూర్చింది.

తనిప్పుడు మిసెస్ రాజారావు కాదు... ఎంత బాగుంది కొత్తగా లభించిన ఈ స్వేచ్ఛ.

ఒక రాక్షస సంహారం జరిగితే పండగ చేసుకున్న ప్రజల్లాగా కేరింతలు కొట్టాలనిపించింది. కళ్ళముందు పునర్జన్మ పొందిన ఎందరో అమాయకులు కదలాడారు. ఎవరో అతడిని కాల్చి చంపిన వీరుడు. అతడిని పూలదండతో సత్కరించాలనిపించింది. తను చేయలేని ఓ మహత్కార్యాన్ని ధైర్యంగా చేసిన అతనికి మనసారా కృతజ్ఞతలు అర్పించాలనిపించింది.

ఆరోజు గుర్తొచ్చింది. ఆమె కళ్ళముందు ఆనాటి సంఘటన, సన్నివేశం

కదలాడాయి.

రాజారావు అన్నలు, తమ్ముళ్ళు అతని ఆఖరి ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారు.

అప్పటికి ఆమె నిర్వికారంగా నేల చూపులు చూస్తూ అక్కడే కూర్చుని వుంది.

ఆమెకి కొంచెం ఎడంగా అతను నిర్జీవంగా పడుకుని వున్నాడు. బాగా స్ఫురద్రూపి అయిన అతని శరీరం చాలా స్థలం ఆక్రమించింది. తెల్లటి దుప్పటిలో అతని శరీరం కప్పి వుంది. కేవలం ఒక చాప మీద అతను పడుకుని వున్నాడు. అతని తల దగ్గర చిన్న ప్రమిదలో దీపం వెలుగుతోంది.

చుట్టూ వున్న వాళ్ళంతా ఏడుస్తున్నారు. ఆమె కళ్ళనుంచి నీటి చుక్క రాలడంలేదు. కళ్ళు గాజు కళ్ళలా వున్నాయి. నిశ్శబ్దంగా, రాయిలా కూర్చుని వుంది.

కొందరు పరామర్శలకు వచ్చిన బంధువులు, స్నేహితులు ఆమెని ఆశ్చ ర్యంగా చూస్తున్నారు. గుండె పగిలేలా ఏడుస్తుందనుకుంటే ఇలా మౌనంగా వుందేంటి? ఏడవదేంటి? ఈమెకి బాధ లేదా? మొగుడు మీద ప్రేమ లేదా? ఇలా రకరకాల ప్రశ్నలు వాళ్ళ మనసుల్లో మెదులుతున్నాయి. అవన్నీ స్పష్టంగా కళ్ళల్లో ప్రతిఫలిస్తూంటే ఆమెనే చూస్తున్నారు. ఆమె కళ్ళల్లోంచి రాలిపడే కన్నీటి చుక్కలు లెక్కబెట్టడానికి కాబోలు ఎంతో ఉద్విగ్నంగా చూస్తున్నారు. అవన్నీ తనకేం పట్టనట్టు, ఇద్దరు ఆడపిల్లల్ని చెరోవైపు కూర్చోబెట్టుకుని మౌనంగా కూర్చుంది ఆమె.

విశాలమైన ఏసి గదిలో, డన్‌లప్ పరుపుమీద, మఖమల్ దుప్పట్లు కప్పుకుని, దర్జాగా పడుకునే అతను కేవలం చాపమీద వున్నాడిపుడు... నానా దుర్మార్గాలు చేసి సంపాదించిన డబ్బులో ఒక్క రూపాయి కూడా అతని వెంట పోవడంలేదు. పొందిన పదవులు, అధికారాలు ఏవీ కూడా అతని వెంటలేవు. మరి అవన్నీ ఎందుకు చేసినట్టు? ఎప్పుడూ పాతికమంది పార్టీ కార్యకర్తలతో తిరుగుతూ, మరో పాతికమంది శాసనసభ్యులతో నిత్యం మందులో మునిగితేలే అతని వెంట ఒక్కరూ పోవడం లేదేం.

"అమ్మా హిమా! ఒక్కసారి గొంతు విప్పి ఏడువు తల్లీ... దుఃఖం గుండెల్లో వుండకూడదు" పిన్నత్తగారు ఓదార్చడానికి, ధైర్యం చెప్పడానికి ఏవో చెప్తోంది.

హిమబిందుకు నవ్వాలని అనిపించింది. విరగబడి నవ్వాలనిపించింది.

"నువ్విలా అయితే, ఆ పిల్లల్ని ఎవరు చూస్తారు? వాళ్ళ కోసమన్నా నువ్వు గుండె దిటవు పర్చుకోవాలి" ఇంకెవరో అంటున్నారు.

తనకసలు దిగుల్లేదు. ఇకనుంచీ పిల్లల్ని తనెంతో బాగా పెంచుకోగలదు. తన ఆశయాలకు, ఆదర్శాలకు అనుగుణంగా ఫలానా పిల్లల తల్లి ఈమె అని అందరూ అనుకునేంత గొప్పగా, గర్వంగా పెంచుకోగలదు.

"సి.ఎం.గారు వస్తున్నారు" అంటూ సెక్యూరిటీ గార్డ్ హడావుడిగా వచ్చాడు.

అక్కడ చేరిన వందలమంది జనం లేచి నిలబడ్డారు.

తెల్లటి బట్టల్లో సి.ఎం. ఆయన వెనకాల పి.ఎ, గన్‌మాన్, ఎందరో ఇతర మంత్రులు, శాసన సభ్యులు వెంటరాగా మహారాజులా వచ్చాడు. ఆయనతోపాటే ఖరీదైన పెర్‌ఫ్యూమ్ పరిమళం కూడా అక్కడ చేరింది.

ఆమె మౌనంగా లేచి నిలబడింది. పిఏ చేతుల్లోని పూలదండ సిఎంకి అందించాడు. ఆయన నేరుగా అతని దగ్గరకు నడిచి దండ అతని మీద పెట్టి నమస్కరించాడు. ఆ వెనకాలే మరెన్నో పూలదండలు అతని శరీరం కనిపించ కుండా... తిరిగి అందరూ ఆమె దగ్గరకు వచ్చారు.

సిఎంగారు స్వరం ఓదార్పుగా... "బాధపడకమ్మా... అధైర్యపడకు. మేమంతా వున్నాం. హంతకుడు ఎవరైనా వాడిని ఉరికంబం ఎక్కించి తీరతాం. ప్రతిపక్షాల పనే అని మాకు తెలుసు. సరైన ఆధారాలు దొరకగానే వాడి పని పడతాం..."

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఖరీదైన అతని బట్టల్లాగే వున్న ఖరీదైన మాటలు వింటోంది.

""వేళ మించిపోతోంది కార్యక్రమం జరిపించండి" ఎవరో అన్నారు.

హడావుడి మొదలైంది. ఎన్నో ఏర్పాట్లు... అతడి భౌతికకాయాన్ని నలుగురు అన్నదమ్ములు తీసికెళ్ళి బైట అతని కోసం, అతని చివరి ప్రయాణానికి తయారు చేసిన కట్టెల వాహనం మీద పడుకోబెట్టారు. అందరూ కన్నీళ్ళు పెడుతున్నారు... పిల్లలు భయంగా తల్లిని కరుచుకుని కూర్చున్నారు. ఆమెకదేం తెలియడంలేదు. కళ్ళముందు ఏవో దృశ్యాలు... ఇకనుంచీ తను మిసెస్ రాజారావు కాదు. ఇంక ఏ రాజకీయాలతో తనకేం సంబంధంలేదు. తనిప్పుడు స్వేచ్ఛాజీవి.

"రామ్మా! ఒకసారి, ఆఖరిసారి మొహం చూడు తల్లి వచ్చి" బలవంతంగా భుజం పట్టుకుని బైటికి తీసుకెళ్ళింది. అతని మొహం నిర్వికారంగా, నిశ్చలంగా

వుంది. బతికున్నప్పుడు కనిపించిన క్రూరత్వం లేదు. దీనంగా అనిపిస్తోంది... 'నాతో ఎవరూ రారా' అని అడుగుతున్నట్టు అనిపించింది. బియ్యం గుప్పెడు తీసి అతని నోట్లో పోయాలట. ఆమె చేతుల్లోంచి ఎటో జారిపోయాయి. ఆమె మళ్ళీ మౌనంగా వచ్చి నిలబడింది. అందరూ చిత్రంగా చూస్తున్నారు.

"పాపం హఠాత్తుగా విన్న వార్తతో షాక్ తింది. జాగ్రత్తగా చూడండమ్మా ఆవిడ్ని, పాపం చిన్నపిల్లలున్నారు" సి.ఎం.గారు అత్తగారితో అంటున్నారు.

ఆవిడ కుమిలి, కుమిలి ఏడుస్తోంది.

ఒక్కసారిగా గోల అరుపులు, జిందాబాద్‌లు, అమర్ రహేలు, ఏడుపులు. అతని ప్రయాణం సాగింది. అసెంబ్లీ వైపు కాదు స్మశానం వైపు.

హిమబిందు ఒక్కసారిగా ఒళ్ళు జలదరించినట్టు అయి ఉలిక్కిపడింది.

"అమ్మా హోంవర్కు అయిపోయింది అన్నం పెడతావా?" రమ్య అడిగింది. నవ్య టేబిల్‌పైన తలపెట్టుకుని నిద్రపోతోంది.

"అయ్యో!" హిమబిందు నవ్యని మృదువుగా లేపి "రా తల్లీ అన్నం తిని పడుకుందువుగాని" అంటూ లోపలికి తీసికెళ్ళింది. పిల్లలిద్దరూ అన్నాలు తిని పడుకున్నారు.

హిమబిందుకి నిద్ర పట్టలేదు. అమాయకంగా కల్మషంలేని మొహాలతో హాయిగా, నిశ్చింతగా నిద్రపోతున్నారు పిల్లలు. ఎంత అమాయకులు? భవిష్యత్తులో ఈ దేశం ఎలా వుంటుందో, తమ భవిష్యత్తు ఎలా వుంటుందో అనే ఆలోచన లేకుండా ఎంత ప్రశాంతంగా నిద్రపోతున్నారు!

వీళ్ళని బాగా చదివించాలి. ఈ రాజకీయాలకు దూరంగా పెంచాలి. ఐ.ఎ.యస్, ఐ.పి.యస్, డాక్టర్స్, ఇంజనీర్స్ ఇలా ఉన్నత చదువులు చదవాలి వీళ్ళు. చదివాక! ఆమె మనసులో హఠాత్తుగా ఒక ప్రశ్న మెదిలింది. అవును చదివాక ఏంచేయాలి? ఐఎఎస్‌లు, ఐపియస్‌లు మంత్రుల చేతుల్లో కీలుబొమ్మలు. వాళ్ళెలా చెబితే అలా వుండాలి. స్వంత నిర్ణయాలు తీసుకోకూడదు. స్వంత ఆలోచనలు చేయకూడదు. స్వంత ప్రణాళికలు వేయకూడదు. ఎన్ని ఆదర్శాలున్నా, ఎన్ని మంచి ఆలోచనలున్నా అన్నీ వ్యర్థం. మరేం చేయాలి? వీళ్ళ భవిష్యత్తేంటి? ఇంజనీర్లను చేసి అమెరికా పంపించాలా? యువత మొత్తం అమెరికా వెళ్ళిపోతే, ఈ దేశం ఇలా వృద్ధ జంబూకాల చేతుల్లో ఏమైపోతుంది? వీళ్ళే ఈ గుండాలు, ఖూనీకోరులు, అవినీతిపరులు, స్వార్థపరులు, ధనమదాంధులు, కామాంధులు

వీళ్ళే ఈ దేశాన్ని ఏలతారు. ఈ దేశం ఎవరిది? ఈ నాయకులంతా ఎవరు? ఎవరి వలన వీళ్ళు నాయకులు అయ్యారు? ప్రజల వలన, ప్రజల చేత, ప్రజల కొరకు నాయకులైన వీళ్ళంతా ప్రజలకి ఏం చేస్తున్నారు? ప్రజలంటే వాళ్ళ కుటుంబాలేనా? నిరుపేదల బతుకులు ఎన్నికలప్పుడు ప్రచారానికి ఉపయోగించు కునేవాళ్ళు, తుఫాన్‌లు, వరదలను ఆస్తులు పెంచుకోడానికి ఉపయోగించేవాళ్ళు. పసిపిల్లల, వీధిబాలల బతుకులతో చెలగాటాలాడే వాళ్ళు ఈ నాయకులు. వీళ్ళంతా ఇలాగే కొనసాగితే ఈ దేశంలో యువత మిగలదు.

"నో" ఎందుకో హిమబిందుకి ఒక్కసారిగా నిలువెల్లా వణుకులాంటిది వచ్చింది. నుదుటి మీద చిరుచెమట్లు పట్టాయి. ఈ దేశం నాది... నేను కూడా ఇందులో భాగస్వామిని... అనుకుంది. చదువు, ఆలోచన, ఆదర్శాలు వున్న తను వీళ్ళందరికి భయపడి ఈ నాలుగు గోడల మధ్య వుండకూడదు... వుండకూడదు... అలా అని ఏం చేయగలదు తను! చేయాలి, ఏదో ఒకటి చేయాలి.

అలాగని జీవితాంతం మిసెస్ రాజారావుగా బతకలేదు. ఒక ఖూనీకోరుకి ఖర్మకాలి భార్య అయింది. అతను మరణించినా అతని భార్యగా ఎందుకు బతకాలి? ఇహనుంచీ ఈ జీవితం తనది... తన స్వంతం. దీనిమీద ఎవరికీ ఏ అధికారం లేదు. తను ఏమైనా చేయచ్చు తన పిల్లల కోసం... వాళ్ళ భవిష్యత్తు కోసం... ఈ పిల్లలు ఇలాంటి మరెందరో వేల, లక్షలమంది పిల్లలు... వీళ్ళంతా పెరిగి పెద్దవాళ్ళై ఈ దేశాన్ని కాపాడుకోవాలి. దేశ భవిష్యత్తు వయసు మళ్ళినవాళ్ళది కాదు... పిల్లలది... నేటి బాలలే రేపటి పౌరులు... కాదు... కాదు... నేటి బాలలే రేపటి పాలకులు కావాలి. అవును పాలకులు కావాలి. అందుకు తను ముందుగా రాజకీ యాల్లో పాదం మోపాలి. కానీ, మిసెస్ రాజారావుగా కాదు. హిమబిందుగా, హిమబిందు ఎమ్ఏ లిటరేచర్. తన పాదం అధికార పార్టీలో కాదు... ప్రతిపక్ష పార్టీలో కాదు... తనది మరో పార్టీ... కొత్త పార్టీ... స్వంత పార్టీ...

దృఢమైన నిర్ణయంతో, కొండంత ఆత్మవిశ్వాసంతో హిమబిందు పిల్లలిద్దరి మధ్యా పడుకుని, నిశ్చింతగా కళ్ళు మూసుకుంది.

***

*(జూన్ 2006, భూమిక)*